# మంచి కుటుంబం

నేటి పారిశ్రామిక ప్రపంచంలో దిగజారుతున్న విలువలు, మానవ సంబంధాలు చూసి భవిష్యత్తు గురించి భయం కలుగుతుంది. ఎక్కడైనా మానవ సంబంధాలు మెరుస్తూ వెల్లి విరిస్తున్నాయని తెలిసినప్పుడు మనసు మురిసిపోతుంది.



"కాస్త కన్నీరు. మరి కాస్త సంతోషపు తేనీరు" అని తిలక్ అన్న మాట ముత్యాల మూట.

ఈ ఆధునిక ప్రపంచంలో వేగం పెరిగింది. కుటుంబ వ్యవస్థలో ఒకప్పుడున్న అభిమానాలూ ప్రేమలూ మమతానురాగాలూ నేడు తగ్గుతూ వస్తున్నాయి. పాశ్చాత్యా దేశాల్లో అయితే మరీనూ.

అందుచేతే అక్కడన్ని విడాకులు. యువతరంలో అనేక పెడధోరణులు.

తల్లిదండ్రుల మధ్య కీచులాటలూ పంతాలూ పట్టింపులూ పిల్లలపై ప్రభావం చూపుతాయని మనస్తత్వవేత్తలు చెబుతున్నారు. పెద్దల అతిగారం లాగే అతి నిర్లక్ష్యం కూడా పిల్లల్ని పాడు చేస్తుంది. కుటుంబ వ్యవస్థ కుంటుపడ్డప్పుడు పిల్లలు పెడదోవపడతారు.

కుటుంబ సభ్యుల మధ్య ఒకరిపై ఒకరికి ప్రేమానురాగాలు తగ్గినప్పుడు ఎవరూ విజయపథంలో పయనించలేరు. తల్లిదండ్రుల వాత్సల్యం, ప్రోత్సాహం పిల్లలకెంతో అవసరం. అవిప్పుడు పిల్లలకందవలసినంతగా అందడం లేదు.

అందుకు బతుకు పరుగు పందెం కూడా ఓ కారణం.

బతుకు పరుగు పందెంలో ఎవరికి వారే యమునా తీరేగా ఉండడంతో పెద్దల నుంచి పిల్లలకూ పిల్లల నుంచి పెద్దలకూ అభిమానాలు కొరవడుతున్నాయి. స్నేహాలూ అలాగే వుంటున్నాయి.

ఒకరి ఉన్నతిని మరొకరు కోరుకునే స్నేహాలు తగ్గుతున్నాయి. ఈ పోటీ ప్రపంచంలో ఒకరికొకరు తోడ్పడ్డం కంటే ఒకరిని చూసి మరొకరు ఏడ్వడమే ఎక్కువగా కన్పిస్తోంది.

ఇలాంటి పరిస్థితిలో ఓ మంచి కుటుంబాన్ని చూసినప్పుడు యడారిలో ఒయాసిస్ కన్పించినట్టు హృదయం ఉప్పొంగుతుంది.

అది కపిల్ కుటుంబం. క్రికెట్ ప్రపంచంలో కపిల్ ఓ మెరుపు తీగ. క్రికెట్ కిరీటంలో కపిల్ కోహినూర్ వజ్రం.

ఆల్ రౌండర్‌గా తన ప్రతిభా పాటవాలను చూపుతున్న కపిల్‌దేవ్ టెస్ట్ మ్యాచ్‌లలో 431 వికెట్లు పడగొట్టి టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసుకున్న అసాధారణ బౌలర్‌గా సర్ రిచర్డ్ హాడ్లీ ప్రపంచ రికార్డును కైవసం చేరుకున్నాడు. మరో వికెట్ పడగొడితే చాలు, కపిల్ కొత్త ప్రపంచ రికార్డు నమోదవుతుంది.

జనవరి 30న బెంగుళూరులో కపిల్ 431వ వికెట్ పడగొట్టిన దృశ్యం అపురూపం.

ఈ రికార్డు చేరుకోవడానికి ఆరోజున కెప్టెన్ అజహరుద్దీన్ కపిల్‌కు ఎక్కువ బంతులేపే అవకాశం కల్పించడం క్రీడా స్ఫూర్తికీ మానవ సంబంధాలకూ అద్దం పట్టింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తనకొచ్చిన పదిహేను వేల రూపాయలను అజహర్ కపిల్‌కు బహుమతిగా ఇవ్వడం మరో సుందర దృశ్యం . ఆ బహుమతికి డబ్బుతో విలువకట్టలేం. మనసుతోనే విలువకట్టాలి. ఆ విలువలు ఎందరికి తెలుసు!

అజహర్, సిద్ధూ పైకెత్తుకోగానే కపిల్ చేతులెత్తి ఊపాడు. అప్పుడతను చూసింది తన భార్యనే. కపిల్ కోరిక మీద అతనికి మనో స్థయిర్యం, ప్రోత్సాహం ఇవ్వడానికొచ్చిందామె.

ప్రపంచ రికార్డును చేరుకున్న విజయోత్సవ వేళలో "వెంటనే మా అమ్మవద్దకెళ్లాలని వుంది" అన్నాడు కపిల్. అతనీ స్థానానికి చేరుకోవడానికి ఆ తల్లి కూడా కారణమే. నాలుగేళ్ళ క్రితం విదేశాల్లో పర్యటిస్తున్న కపిల్‌కు తనకు గుండెపోటు వచ్చిన విషయాన్ని తెలియనీయలేదామె. ఇదీ మమతానురాగాలకు నెలవైన కపిల్ కుటుంబం. కీర్తి ప్రతిష్టలూ, ఆస్తి పాస్తులూ ఎంత పెరిగినా మానవ సంబంధాలు తరగని మంచి కుటుంబం అది.

కుంటుపడుతున్న కుటుంబ వ్యవస్థ కోలుకోడానికి కపిల్ కుటుంబం స్ఫూర్తి కావాలి.

7.2.94

ఆంధ్రభూమి దినపత్రిక